క్లుప్తంగా

ద్విచక్ర వాహనం దగ్ధం



పరిగి: మండల కేంద్రం పరిగిలో అల్లావుద్దీన్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతైంది. స్థానికుల వివరాలమేరకు... జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డులో నివాసముంటున్న అల్లావుద్దీన్ తన సూపర్ ఎక్సెల్ వాహనాన్ని ఇంటి వద్ద పార్క్ చేశాడు. బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం మంటలకు ఆహుతై కాలిపోయింది. ఈ ఘటనపై పరిగి పోలీస్‌స్టేషన్‌లో అల్లావుద్దీన్ ఫిర్యాదు చేశారు. ఎవరైనా వాహనానికి నిప్పు పెట్టారా? లేదా వేరే ఏదైనా అగ్ని ప్రమాదం జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

ఆర్‌ఓబీ భూములు పరిశీలించిన జేసీ



ఆర్‌ఓబీ భూములను పరిశీలిస్తున్న జేసీ చేతన్

పెనుకొండ రూరల్: మండలంలోని హరిపురం దగ్గర ఆర్‌ఓబీ భూములను జాయింట్ కలెక్టర్ చేతన్ బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్ 136–3లోని 1.24 ఎకరాల దేవుని మాణ్యం, సర్వే నంబర్ 40లోని 1.89 ఎకరాల సిరికల్చర్ కార్యాలయ భూములను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలోని పలు విభాగాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించినట్లు తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్తిక్, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, ఏడీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

సజావుగా వాహనాల వేలం



వాహనాల వేలంలో పాల్గొన్న సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి

మడకశిర: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివిధ కేసుల్లో పట్టుబడిన 47 ద్విచక్ర వాహనాలను సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం వేశారు. డిపాజిట్ చెల్లించిన వారు పోటీ పడి వాహనాలను దక్కించుకున్నారు. మొత్తం 47 ద్విచక్ర వాహనాలను వేయడం ద్వారా జీఎస్టీతో కలిపి ప్రభుత్వానికి రూ.8,36,148 ఆదాయం వచ్చిందని సీఐ తెలిపారు. ఈ వేలం పాటలో ఎస్‌ఐ నాగేంద్ర, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

రొళ్ల: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా క్షేత్ర సహాయకులు చర్యలు తీసుకోవాలని ఏపీఓ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత హొట్టేబెట్ట, ఆర్.వద్రహట్టి గ్రామాల సమీపాన చేపట్టిన ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఓ నాగరాజు సూచనలు, సలహాలిచ్చారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లిలో దాతల సహకారంతో నిర్మిస్తున్న కరావులీశ్వర దేవాలయ నిర్మాణానికి మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ బాలన్నగారిపల్లి పోతుల రామకృష్ణారెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని బుధవారం ప్రకటించారు. అలాగే గోరంట్లలో నూతనంగా నిర్మిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం నిర్మాణానికి రూ. 20,116 విరాళం ప్రకటించారు. అలాగే గంగంపల్లి తండాలో నిర్మిస్తున్న మారేమ్మ దేవాలయ నిర్మాణానికి రూ. 20 వేలను విరాళంగా ప్రకటించారు. అలాగే పులచెట్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రామలయ నిర్మాణానికి నూరు బస్తా సిమెంట్ వితరణ చేశారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులకు ఆ మొత్తం విరాళాలను అందించారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి

హిందూపురం టౌన్: పట్టణంలో విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రెండు నెలల క్రితమే పట్టణంలో విగ్రహ ఏర్పాటుకు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లకు అర్జీలు ఇచ్చామన్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేయాలని ఏర్పాట్లు చేస్తుండగా మున్సిపల్ కమిషనర్.. పోలీసుల ద్వారా అడ్డుకున్నారన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, బలిజ సంఘం నాయకులు విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు.

సంక్షేమ పథకాలతో అన్ని విధాలా అండ



మడకశిరరూరల్: వంటిపాళ్యంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



గోరంట్ల: వెంకటరమణపల్లిలో సంక్షేమ లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



చిలమత్తూరు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇక్బాల్

- పథకాలు పక్కాగా అందుతున్నాయి
- జగనన్నకే మా మద్దతంటున్న లబ్ధిదారులు

మడకశిరరూరల్: గ్రామస్థాయిలో అట్టడుగు ప్రజల అర్హతను గుర్తించి సంక్షేమ పథకాలు మంజూరు చేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ మద్దతు ఇస్తామని లబ్ధిదారులు, మహిళలు పేర్కొన్నారు. మండల పరిధిలోని హరేసముద్రం గ్రామ సచివాలయం పరిధిలోని ఒంటిపాళ్యం, క్యాంపురం గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ మూడున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికి లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను కుటుంబ సభ్యులకు అందించి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటి వద్దకు వెళ్లినా ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికి తమ కుటుంబానికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని వివరించారు.

అసత్యా ప్రచారాలను నమ్మొద్దు

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా టీడీపీ అధినేత చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ప్రకాష్, వివిధ కమిటీల నాయకులు లక్ష్మీనారాయణ, నటరాజు, రంగనాథ్, రవి, రొళ్ల అంజినేయులు, జయరామ్, నారాయణ, మంజునాథ్, కార్యదర్శి సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకటరమణపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటరమణపల్లి, నల్లన్నపల్లి, శెట్టిచిన్నంపల్లి, పెరమాళ్లపల్లి గ్రామాల్లో సర్పంచ్ అశ్వర్థరెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధి వివరించారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు చంద్రబాబు రాజకీయ లబ్ధికోసం ఆచారణకు సాధ్యంకాని హామీలను ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చినా హామీలను దాదాపుగా అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమచేస్తున్న విషయాన్ని అందరూ గమనించాలన్నారు. పేదల కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజ యరాంనాయక్, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాషా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నాగభూషన్‌రెడ్డి, ఎంపీడీఈఓ రఘునాథ గుప్తా, పులేరు సర్పంచ్ ప్రభాకరరావు, స్థానిక నాయకులు ఉమాశంకర రెడ్డి, రాజేష్, సంపత్‌కుమార్, చౌడిరెడ్డి, శివరామిరెడ్డి, హైదరవలి, మధుసూధనరెడ్డి, సురేష్‌కుమార్ రెడి,శ్యామసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: దేశంలో ఎక్కడే కాని క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలు అందిస్తున్న దాఖలాలు వేవని, కేవలం ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే ఆ క్రెడిట్ దక్కుతుందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కొనియాడారు. బుధవారం సాయంత్రం ఆయన చాగలేరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులాలు , మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు ప్రజలు ఛీత్కరించుకునేలా ఉన్నాయన్నారు..అమరావతిని సింగపూర్ చేస్తానని రియల్ ఎస్టేట్ వ్యాపారుల కేంద్రంగా మార్చేశాడని మండిపడ్డారు. తాము అభివృద్ధి , సంక్షేమం వైపు వెళ్తుంటే టీడీపీ నేతలు గుడ్డి గుర్రాలకు పళ్ల తోముతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమాల్లో తొడలు కొట్టడం, సుమోలను ఎగిరించడాలు చేస్తున్నాడే కానీ నమ్మి ఓట్లేసిన ప్రజలను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తులు ప్రజా ప్రతినిధులుగా పనికిరారని విమర్శించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని శానిగానిపల్లిలో గతంలో వలంటీర్‌గా పనిచేసిన శాంతకుమార్ (30) అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఎమ్మెల్సీ ఇక్బాల్ బుధవారం ఆ గ్రామానికి చేరుకొని శాంతకుమార్ భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, సర్పంచ్ జయలలిత, తిరుమలేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, వైస్ ఎంపీపీ బయప్ప, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, ఏఓ వంశీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వేణు, నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు అశ్వర్థమ్మ, గోరంట్ల మండలం వెంకటరమణపల్లి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీరి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.2,00,622 లబ్ధి పొందారు. రైతు భరోసా కింద రూ.40,500, పంటల బీమా పథకం ద్వారా రూ.25, 667, పింఛన్ కానుక కింద 66,000, సున్నావడ్డీ ద్వారా రూ.6,688, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.37,500 , వైఎస్సార్ సున్న వడ్డీ రైతు రుణంపై రూ.23,924 లబ్ధి చేకూరింది. జగనన్న తమ కుటుంబానికి చేసిన మేలును ఎప్పటికీ మరువబోమని అశ్వర్థమ్మ పేర్కొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు నాగమ్మ, వీరిది మడకశిర మండలం క్యాంపురం గ్రామం. వైఎస్సార్ ఆసరా కింద రూ.6,220, రైతు భరోసా ద్వారా రూ.40,500 , పింఛన్ కానుక కింద రూ.82 వేలు, జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.15 వేలు, సున్నా వడ్డీ కింద రూ.925 చొప్పున మొత్తం రూ.1,44,645 లబ్ధి పొందారు. తమ కుటుంబానికి అన్ని విధాలా భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కే మద్దతుగా ఉంటామని నాగమ్మ తెలిపారు.

రహదారి భద్రతా నియమాలపై అవగాహన



కార్మికులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పెనుకొండ రూరల్: వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్‌ఐ రమేష్ బాబు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పట్టణ సమీపంలోని షీ ఫారం దగ్గర వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. మరోవైపు కియా అనుబంధ పరిశ్రమైన సంగ్వు హై టెక్‌లో కార్మికులకు ఎస్‌ఐ రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

చిలమత్తూరు: అన్ని రకాల వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికించుకోవాని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీసులు చాగలేరులో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలకు రేడియం స్టిక్కర్లను అతికించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వాహన దారులను ఉద్దేశించి మాట్లాడారు. చీకట్లో రహదారులపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, రేడియం స్టిక్కర్లు లేకపోవడం వల్ల ఇటీవల కాలంలో ఎద్దుల బండి లో వెళుతున్న ఇద్దరు మృతి చెందారన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలని సూచించారు.

పనుల పురోగతిపై సమీక్ష

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అధ్యక్షతన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపడుతున్న పనుల పురోగతిపై చర్చించారు. కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్, టెక్నికల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీ తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు



చీపులేటి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న దృశ్యం

మడకశిర: నగర పంచాయతీలోని చీపులేటి వద్ద బుధవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. చీపులేటి నుంచి ఇద్దరు ద్విచక్ర వాహనంలో రోడ్డుపై వచ్చారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం రోడ్డుపై ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. వెంటనే గాయపడ్డిన వారిని ఆస్పత్రికి తరలించారు.

ఘర్షణకు దిగితే చర్యలు

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామ సమీపంలో ఉన్న దర్గా వద్ద ఉత్సవాలను సంబంధించి ఘర్షణకు దిగితే చర్యలు తప్పవని ఎస్‌ఐ విజయ్ కుమార్ హెచ్చరించారు. మూడు రోజుల పాటు ఉత్సవాల అనుమతి కోసం బాజీసాబ్, సనావుల్లా తదితరులు రెవెన్యూ, పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దర్గా ఉత్సవాల విషయం హైకోర్టు పరిధిలో ఉందని జాగీర్దార్ జిక్రియా హుస్సేనీ అభ్యంతరం తెలిపారు. దీంతో బుధవారం ఎస్‌ఐ ఇరువర్గాలను పిలిపించి చర్చించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నడుచుకోవాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

గుడిబండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నితిన్‌రెడ్డి

మడకశిరరూరల్: రాష్ట్ర రెడ్డి సంఘం విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మడకశిర మండలం జక్కేపల్లికి చెందిన నితిన్‌రెడ్డి ఎంపిక చేశారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటశివారెడ్డి ప్రకటించారని నితిన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత వారంలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర ఎన్నికలో రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్ణయం మేరకు అధికారికంగా ప్రకటించారన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

గోరంట్ల: స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో హిందూపురం– గోరంట్ల ప్రధాన రహదారిపై బుధవారం రెండు ద్విచక్ర వాహనలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు.. గోరంట్లకు చెందిన మహపీరా, మల్లిరెడ్డి గోరంట్ల వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో మహపీరా, మల్లిరెడ్డి తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలించారు.

నేడు వేమన జయంతి వేడుకలు

పెనుకొండ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఉదయం ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఉదయం పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు ప్రారంభమవుతాయని ప్రజలు, రెడ్డి సోదరులందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిర(అగళి): అగళి మండలంలోని ఇరిగేపల్లిలో గురువారం ఉదయం 9.30 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్ర తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని సూచించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ ఇక్బాల్

చిలమత్తూరు: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ సమక్షంలో టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ చేరారు. చాగలేరులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ నేపథ్యంలోనే పోతులప్పల్లి , చాగలేరుకు చెందిన శంకర, పెద్ద కుళ్లాయప్ప, వెంకటేశు, రామాంజి, చిన్న చౌడప్ప, సోము, ఆదినారాయణప్ప, వెంకటరమణప్ప, లలితమ్మ, పార్వతమ్మ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్సీ ఇక్బాల్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధి పనుల వేగం పెంచాలి

మడకశిరరూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల వేగం పెంచడంతో సచివాయం ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి సిబ్బందికి సూచించారు. బుధవారం క్యాంపురం గ్రామంలో హరేసముద్రం సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే అభివృద్ధి పనులు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, ప్రధాన సమస్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, కార్యదర్శి సావిత్రి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఏపీఓ హెన్రీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తామని, కూలీల సంఖ్య పెంచాలని సూచించారు.

ఘనంగా బ్రహ్మా బాబా పూజోత్సవం



అలంకరణలో బాబా చిత్రపటం

అమరాపురం: స్థానిక ప్రజాపిత బ్రహ్మా కుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ప్రజాపిత బ్రహ్మా బాబా పూజోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు.

వక్కలిగ భవన నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

మడకశిర: మడకశిరలో బేగార్లపల్లి క్రాస్ వద్ద నిర్మిస్తున్న కుంచిటి వక్కలిగ సముదాయ భవన నిర్మాణ పనులను బుధవారం కర్ణాటక రాష్ట్రం మధుగిరి ఎమ్మెల్యే వీరభద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముదాయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి తనవంతు సహాయ సహకారాన్ని అందిస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగులు సమైక్యంగా ఉండాలని కోరారు. అనంతరం ఆయన్ను కుంచిటి వక్కలిగ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. తర్వాత ఎమ్మెల్యే వీరభద్రయ్య సముదాయ భవనం నిర్మాణానికి తనవంతుగా రూ.రెండు లక్షలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు అనంతరాజు, సంఘం గౌరవాధ్యక్షుడు కాంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

అందరూ మెచ్చేలా మహా శివరాత్రి ఉత్సవాలు

లేపాక్షి: లేపాక్షిలో ప్రతి యేటా జరిగే మహాశివ రాత్రి ఉత్సవాలను అందరూ మెచ్చేలా అత్యంత వైభవంగా నిర్వహించాలని గ్రామ పెద్దలు, స్థానికులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తీర్మానించారు. బుధవారం ఆలయ ఆవరణంలో ఉన్న అన్నదాన సత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమావేశం జరిగింది. మహాశివ రాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడమే కాకుండా లేపాక్షి ఆలయ విశిష్టతను చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు విచ్చేస్తారని అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తామన్నారు.

'పురం'లో శాంతి దినోత్సవం



శాంతి యాత్రను చేస్తున్న బ్రహ్మకుమారీలు

హిందూపురం టౌన్: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పితాశ్రీ బ్రహ్మ పుణ్య స్మృతి దివాస్‌ను పురస్కరించుకుని 54వ అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చిన్న మార్కెట్ నుంచి శాంతి యాత్ర నిర్వహించారు. రాజయోగిని బ్రహ్మ కుమారి సుగంధ దీదీ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు గోడను ఢీకొట్టిన కారు



బోల్తా పడిన కారు

మడకశిర (అగళి): అగళి మండలం పి.బ్యాడిగెర వద్ద బుధవారం తెల్లవారుజామున ఓ కారు కల్వర్టు గోడను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారు డ్రైవర్ మాత్రమే ఉన్నారు. కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పినట్లు స్థానికులు తెలిపారు. శిరా నుంచి అగళి వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.